సాక్షి
నిజామాబాద్
గురువారం । 23 । మే । 2024



ప్రధాన కాలువలో పూడిక..

శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి నీటిని సరఫరా చేసే లక్ష్మి ప్రధాన కాలువలో పూడిక పేరుకుపోయింది.

- 8లో ▸



తూకం వేయగానే..

కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తూకం వేయగానే మిల్లులకు తరలించాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు ఆదేశించారు.

- 8లో ▸

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 41.7 /26.5

ఉదయం నుంచే ఎండ తీవ్రత పెరుగుతుంది. మధ్యాహ్నం వడగాలులు వీస్తాయి. ఉక్కపోతగా ఉంటుంది. రాత్రి నిర్మలంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

ఈదురు గాలులతో కూడిన వర్షం



సుభాష్‌నగర్: జిల్లా కేంద్రంతో పాటు సిరికొండ, డొంకేశ్వర్ మండలాల్లో బుధవారం సాయంత్రం ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. భారీ గాలులకు చెట్లు, కొమ్మలు విరిగి పడగా, ఇళ్ల రేకుల పైకప్పులు ఎగిరిపడ్డాయి. ఉరుములు, మెరుపులు, పిడుగులతో కూడిన వర్షం కురవడంతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. బుధవారం సాయంత్రం గంట పాటు భారీ గాలులతో కూడిన వర్షం కురిసింది. రెండు రోజులుగా ఉష్ణోగ్రతలు పెరుగుతుండగా, ఉక్కపోత మొదలైన విషయం తెలిసిందే.

డిగ్రీ పరీక్షల్లో ముగ్గురు విద్యార్థులు డిబార్

- విధుల్లో అలసత్వం వహించిన అబ్జర్వర్ తొలగింపు

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో జరుగుతున్న డిగ్రీ సెమిస్టర్ రెగ్యులర్, బ్యాక్‌లాగ్ పరీక్షల్లో బుధవారం మాల్‌ప్రాక్టీస్‌కు పాల్పడుతూ ముగ్గురు విద్యార్థులు డిబార్‌కు గురైనట్లు ఆడిట్ సెల్ డైరెక్టర్ ఘంటా చంద్రశేఖర్ తెలిపారు. బోధన్‌లోని మీమ్స్ డిగ్రీ కళాశాల పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేసిన సమయంలో విధుల్లో అలసత్వం వహించిన అబ్జర్వర్ శ్రీకాంత్‌ను విధుల నుంచి తప్పించి కొత్త వారిని నియమించినట్లు తెలిపారు. వర్సిటీ పరిధిలో 38 పరీక్షా కేంద్రాల్లో ఉదయం జరిగిన డిగ్రీ 2, 4, 6 సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలకు 9,109 మంది అభ్యర్థులకు గానూ 8,337 మంది హాజరు కాగా 772 మంది గైర్హాజరయ్యారని పేర్కొన్నారు. మధ్యాహ్నం జరిగిన డిగ్రీ 1, 3, 5 సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షలకు 8,020 అభ్యర్థులకు గాను 7,493 మంది హాజరు కాగా 527 మంది గైర్హాజరైట్లు తెలిపారు. ధర్పల్లి ప్రభుత్వ డిగ్రీ కాలేజ్ కేంద్రంలో ఇద్దరు, నిజామాబాద్‌లోని సీఎస్ఐ డిగ్రీ కాలేజ్ కేంద్రంలో ఒకరు మాల్‌ప్రాక్టీస్‌కు పాల్పడుతూ డిబారైనట్లు చెప్పారు. అలాగే జాయింట్ డైరెక్టర్ అతీక్ సుల్తాన్ ఘోరీలు బోధన్, కామారెడ్డిలోని పలు పరీక్షా కేంద్రాల్లో తనిఖీలు నిర్వహించారు.

బాన్సువాడ మున్సిపల్ కమిషనర్ అలీం సస్పెన్షన్



బాన్సువాడ : బాన్సువాడ మున్సిపల్ కమిషనర్ అలీంను సస్పెండ్ చేస్తూ సీడీఎంఏ దివ్య ఉత్తర్వులు జారీ చేశారు. అలీం గతంలో నిర్మల్ జిల్లా భైంసా మున్సిపాలిటీ కమిషనర్‌గా పనిచేశారు. ఆ సమయంలో నిబంధనలను ఉల్లంఘించి అక్రమ నియామకాలు చేపట్టినట్లు ఆరోపణలు వచ్చాయి. దీనిపై విచారణ జరిపిన అధికారులు.. అలీంను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అయితే తాను ఎలాంటి తప్పు చేయలేదని సస్పెన్షన్‌కు గురైన అలీం పేర్కొంటున్నారు. సీడీఎంఏ నిర్ణయంపై ఆయన హైకోర్టుకు వెళ్లి స్టే తీసుకున్నట్లు తెలిసింది.

విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలి

- సీజీఎం అశోక్



నిజామాబాద్‌నాగారం: జిల్లాలో విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని ఎన్‌పీడీసీఎల్ సీజీఎం అశోక్ విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. బుధవారం విద్యుత్‌శాఖ ఎస్ఈ చాంబర్‌లో ప్రత్యేకంగా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలం ప్రారంభం కానున్న నేపథ్యంలో విద్యుత్ సమస్యలు తలెత్తకుండా అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. ముఖ్యంగా వర్క్ ఆర్డర్ల విషయంలో నిర్లక్ష్యం లేకుండా పూర్తి చేయాలన్నారు. కరెంటు సరఫరాలో అంతరాయం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఈ రవీందర్, డీఈలు వెంకటరమణ, శ్రీనివాస్‌రావు, రాజేశ్వర్‌రావు, ఏడీలు, ఏఈలు పాల్గొన్నారు.

ఆ గట్టూ ఈ గట్టూ నాదే..



పదేళ్ల తర్వాత అధికారం దక్కించుకున్న కాంగ్రెస్ పార్టీలో పెత్తనం విస్తరించుకునేందుకు సీనియర్ నాయకులు తమ స్థాయిలో ప్రయత్నాలు చేసుకుంటున్నారు. ఉమ్మడి జిల్లాలో కాంగ్రెస్ గెలుచుకోలేకపోయిన అసెంబ్లీ స్థానాల్లో ప్రాబల్యం పెంచుకునేందుకు పలువురు నాయకులు వివిధ రకాల ఫీట్లు చేస్తున్నారు.

- నిజామాబాద్ అర్బన్ ఇన్‌చార్జిగా ఉంటూ కామారెడ్డిలోనూ షబ్బీర్ పెత్తనం
- ఈ తీరుపై పలువురు కాంగ్రెస్ నాయకుల గుస్సా
- ఎల్లారెడ్డి, జుక్కల్‌లలో షబ్బీర్ బంధువుల జోక్యంపై పార్టీ శ్రేణుల ఫిర్యాదులు
- ఉమ్మడి జిల్లాలో షబ్బీర్ అలీ పేరిట కొందరి వసూళ్లపై నిరసన

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: బాల్కొండ, ఆర్మూర్‌లలో పరిస్థితి ఒకలా ఉండగా, జిల్లా కేంద్రాలైన నిజామాబాద్ అర్బన్, కామారెడ్డి సెగ్మెంట్లలో షబ్బీర్ అలీ పెత్తనం పట్ల పలువురు మొదటి, ద్వితీయ, తృతీయ శ్రేణి నాయకులు గుస్సా అవుతున్నారు. షబ్బీర్ పేరు చెప్పుకుని కొందరు నాయకులు ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారని పార్టీ శ్రేణులు గగ్గోలు పెడుతున్నాయి.

అసెంబ్లీ ఎన్నికల్లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కామారెడ్డి నుంచి పోటీ చేశారు. దీంతో నిజామాబాద్ అర్బన్ నుంచి బరిలోకి దిగిన షబ్బీర్ అలీ ఓటమి చెందారు. ఓడినవారే నియోజకవర్గ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. అయితే షబ్బీర్ నిజామాబాద్ అర్బన్ ఇన్‌చార్జిగా ఉంటూనే తన సొంత నియోజకవర్గమైన కామారెడ్డిలోనూ పెత్తనం చేస్తూ వస్తున్నారు. ఈ క్రమంలో షబ్బీర్‌కు రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుగా కేబినెట్ ర్యాంకు పదవి వచ్చింది.

నిజామాబాద్ అర్బన్ నుంచి ఎమ్మెల్యే టిక్కెట్ ఆశించి దక్కించుకోలేకపోయిన పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ బొమ్మ మహేశ్‌కుమార్ గౌడ్‌కు ఎమ్మెల్సీ అవకాశం కల్పించారు. మహేశ్ గౌడ్ పీసీసీ అధ్యక్ష పదవి రేసులో ఉన్నారు. మరోవైపు బీసీ కోటాలో కేబినెట్ రేసులోనూ ఉన్నారు. మహేశ్ గౌడ్ నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గంలో గట్టి ప్రాబల్యం కలిగి ఉన్నారు. ఈ క్రమంలో షబ్బీర్ కామారెడ్డిలో పెత్తనం చేస్తూనే నిజామాబాద్ అర్బన్‌లో హవా నడిపిస్తుండటం పట్ల ఇక్కడి కాంగ్రెస్ శ్రేణులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

గత శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా బీఆర్ఎస్‌లో ఉండి పనిచేసిన పలువురు రౌడీషీటర్లను సైతం షబ్బీర్ కాంగ్రెస్‌లో చేర్చుకుంటున్నారంటూ సీనియర్ నాయకులు, కార్యకర్తలు ఆరోపిస్తున్నారు. కామారెడ్డిలోనూ పలువురు అవకాశవాదులను పార్టీలోకి చేర్చుకుని మొదటి నుంచి పార్టీ కోసం కష్టపడి పనిచేసిన తమకు అన్యాయం చేస్తున్నారని కార్యకర్తలు, నాయకులు వాపోతున్నారు. మరోవైపు షబ్బీర్ తమ్ముడు, మేనల్లుడు, ఇతర బంధువులు ఎల్లారెడ్డి, జుక్కల్ నియోజకవర్గాల్లోనూ జోక్యం చేసుకుంటున్నారంటూ పలువురు సీనియర్ కార్యకర్తలు పీసీసీ నాయకత్వానికి ఫిర్యాదులు చేయడం గమనార్హం.

ఎంపీ స్థానం, మున్సిపల్ కార్పొరేషన్ డౌటే..

శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు కోసం కష్టపడిన వాళ్లను కాదని బీఆర్ఎస్ నుంచి ఇష్టం వచ్చినట్లు చేరికలను ప్రోత్సహించడంతో అసలుకే ఎసరు వచ్చిందని ఆ పార్టీ శ్రేణులు చెబుతున్నాయి. ఎంపీ ఎన్నికల్లో గెలుపుపై ధీమా లేకుండా పోయిందంటున్నారు. కీలకమైన నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లోనూ ఓటమి మూటగట్టుకోవాల్సిందేనని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. సందట్లో సడేమియాలాగా ఇద్దరుముగ్గురు ద్వితీయ శ్రేణి నాయకులు షబ్బీర్ పేరు చెప్పి కార్పొరేటర్లుగా టిక్కెట్లు ఇప్పిస్తామని ఇప్పటికే వసూళ్లు మొదలుపెట్టినట్లు కార్యకర్తలు కొందరు ఆరోపిస్తున్నారు. ఇక జిల్లాకు కేబినెట్ బెర్త్ సైతం ఇప్పటివరకు దక్కలేదు. మరోవైపు పీసీసీ పీఠం రేసులోనూ మహేశ్‌గౌడ్ ఉన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో షబ్బీర్ అలీ రెండు చోట్లా పెత్తనం చేస్తుండడం పట్ల శ్రేణుల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. ఎటో ఒకవైపు ఉండేలా షబ్బీర్ తేల్చుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

రెండిట్లో పెత్తనమా..

ఉమ్మడి జిల్లాలోని రెండు జిల్లా కేంద్రాలు వేర్వేరు పార్లమెంట్ నియోజకవర్గాల పరిధిలో ఉన్నాయి. షబ్బీర్ అలీ ఆ గట్టూ నాదే.. ఈ గట్టూ నాదే అనేలా నిజామాబాద్ అర్బన్, కామారెడ్డిల్లో పెత్తనం చేస్తానంటే కుదరదని పలువురు నాయకులు అంటున్నారు. ఏదో ఒకచోటే ఉండే విషయమై తేల్చుకోవాలంటున్నారు. పైగా రెండు చోట్లా అవకాశవాదులను పార్టీలో చేర్చుకోవడం పట్ల సీనియర్ కార్యకర్తలు వ్యతిరేకత వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా నిజామాబాద్ అర్బన్‌లో షబ్బీర్ పేరిట కొందరు నాయకులు ఇష్టం వచ్చినట్లు వసూళ్లు చేస్తున్నారంటూ సీనియర్లు ఆరోపిస్తున్నారు.

- నిజామాబాద్ నగరంలోని రామర్తి చెరువును 70 శాతం వరకు అక్రమార్కులు కబ్జా చేశారు. ఈ విషయమై 'సాక్షి'లో కథనాలు ప్రచురితం కావడంతో మున్సిపల్, పోలీస్, ఇరిగేషన్ అధికారులు ఆక్రమణలు తొలగించే పనులు చేపట్టారు. మూడు రోజుల పాటు అక్రమ కట్టడాలను అధికార యంత్రాంగం కూల్చివేసింది. దీంతో కబ్జాదారులు షబ్బీర్ అలీ వద్దకు వెళ్లి అభయం తీసుకుని మళ్లీ ఆక్రమించిన చెరువు భూములకు భారీ గోడను నిర్మించడం పట్ల కాంగ్రెస్ నాయకులే తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికార యంత్రాంగం సైతం మళ్లీ ఆక్రమణల వైపు వెళ్లకపోవడం గమనార్హం.

తాగి నడిపితే జైలుకే..

- నగరంలో జోరుగా డ్రంకన్ డ్రైవ్ తనిఖీలు చేస్తున్న పోలీసులు
- ప్రమాదాల నివారణకు చర్యలు

ఖలీల్‌వాడి: మద్యం తాగి వాహనాలు నడిపితే వారితో పాటు ఇతరులకు ప్రమాదమే. రోడ్డు ప్రమాదాల్లో ఎక్కువ శాతం మద్యం మత్తులో జరుగుతున్నవే. దీంతో నగర పోలీసులు డ్రంకన్ డ్రైవ్‌పై ప్రత్యేక దృష్టి పెట్టారు. నగరంలోని ప్రధాన కూడళ్ల వద్ద ట్రాఫిక్ పోలీసులు డ్రంకన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తున్నారు. మద్యం మత్తులో వాహనాలు నడిపిన వారిని పట్టుకొని కౌన్సెలింగ్ నిర్వహించి, కోర్టులో హాజర పరుస్తున్నారు. ఒకటి కంటే ఎక్కువసార్లు తనిఖీల్లో పట్టుబడ్డ వారికి న్యాయమూర్తులు జైలుశిక్ష విధిస్తున్నారు.

యువకులు, కూలీలే ఎక్కువ

డ్రంకన్ డ్రైవ్‌లో యువకులు, కూలీలు ఎక్కువగా పట్టుబడుతున్నారు. వివిధ ప్రాంతాల నుంచి నగరానికి వచ్చిన వారు సైతం ఉంటున్నారు. నిబంధనలు పాటించకుండా మద్యం మత్తులో వాహనాలను ఇష్టారీతిన నడపడంతో ఎదురుగా వచ్చే వాహనాదారులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రమాదాలు సైతం చోటు చేసుకుంటున్నాయి. దీంతో నగర పోలీసులు మందుబాబుల ఆగడాలు అరికట్టడానికి చర్యలు చేపట్టారు.

ఇటీవల నమోదైన కేసులు

మద్యం తాగి వాహనం నడిపిన 31 మందికి ఈ నెల 20న న్యాయమూర్తి జరిమానా విధించారు. ఇందులో ఒకరికి మూడు రోజులు, మరొకరికి 20 రోజుల జైలు శిక్ష విధించారు. ఈ నెల17న తొమ్మిది మందికి రూ.16 వేలు జరిమానా విధించగా ఒకరికి 12 రోజుల జైలు శిక్ష విధించారు.

నగరంలో జనవరి నుంచి మే 20 వరకు నమోదైన కేసులు

మొత్తం డ్రంకన్ డ్రైవ్ కేసులు	851
జైలుకు వెళ్లిన వారి సంఖ్య	56
జరిమానాలు చెల్లించిన వారు	807
జరిమానాల రూపంలో వచ్చిన ఆదాయం	రూ. 9 లక్షలు



నలుగురికి జైలు..

ఖలీల్‌వాడి: డ్రంకన్ డ్రైవ్‌లో నలుగురికి జైలు శిక్ష విధించినట్లు ఏసీపీ నారాయణ తెలిపారు. బుధవారం నగరంలోని ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో సీఐ వెంకటనారాయణ 13 మందికి కౌన్సెలింగ్ నిర్వహించి, మార్నింగ్ కోర్టులో హాజరుపర్చారు. మెజిస్ట్రేట్ తొమ్మిది మందికి రూ. 15,500 జరిమానా విధించినట్లు తెలిపారు. మరో నలుగురికి ఏడు రోజులు జైలు శిక్షవిధించినట్లు ఏసీపీ చెప్పారు.

మద్యం తాగి డ్రైవింగ్ చేయొద్దు

మద్యం తాగి వాహనాలు నడపొద్దు. తనిఖీలలో 20 నుంచి 45 ఏళ్లలోపు వారే ఎక్కువగా దొరుకుతున్నారు. జల్సాలకు బయటకు వెళ్లి ప్రమాదాలకు గురై మృతి చెందిన ఘటనలు ఉన్నాయి. తల్లిదండ్రులు యువకులపై ప్రత్యేక నిఘా పెట్టాలి. కేసు నమోదు చేసిన తర్వాత ఛార్జ్‌షీట్‌లో ఎన్ని సార్లు తనిఖీలో దొరికారో వెల్లడించడంతో జైలు శిక్ష ఖరారు అవుతుంది.

– నారాయణ, ట్రాఫిక్ ఏసీపీ, నిజామాబాద్

పాలిసెట్‌కు ఏర్పాట్లు పూర్తి

నిజామాబాద్‌అర్బన్: పాలిసెట్ నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని నిజామాబాద్ ప్రభుత్వ సాంకేతిక కళాశాల ప్రిన్సిపాల్ ఏఎస్ ఫణిరాజ్ తెలిపారు. శుక్రవారం నిర్వహించనున్న పరీక్ష కోసం జిల్లా కేంద్రంలోని 16 కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. పరీక్షకు మొత్తం 5,586 మంది విద్యార్థులు హాజరుకానున్నారన్నారు. పరీక్ష ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు కొనసాగుతుందని పేర్కొన్నారు. విద్యార్థులు ఉదయం 10 గంటల్లోపు పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలన్నారు. విద్యార్థులు ఎస్‌బీటీఈటీఎస్ యాప్ ద్వారా నేరుగా పరీక్ష కేంద్రానికి చేరుకోవచ్చన్నారు. 11 గంటల తర్వాత పరీక్ష కేంద్రంలోకి అనుమతి ఉండదని పేర్కొన్నారు.

ప్రభుత్వాస్పత్రులపై నమ్మకం పెంచాలి

- రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలి
- కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు
- సూపరింటెండెంట్లు, వైద్యులతో సమావేశం

నిజామాబాద్‌నాగారం: ప్రభుత్వ ఆస్పత్రులపై ప్రజల్లో మరింత నమ్మకం పెంచాలని.. నిబద్ధతతో వైద్య సేవలందించాలని జీజీహెచ్, బోధన్, ఆర్మూర్ ఆస్పత్రుల సూపరింటెండెంట్లు, వైద్యులకు కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు ఆదేశాలు జారీ చేశారు. బుధవారం జీజీహెచ్‌లోని సూపరింటెండెంట్ చాంబర్‌లో కలెక్టర్ జిల్లా కేంద్ర జనరల్ ఆస్పత్రితో పాటు, బోధన్, ఆర్మూర్ ఆస్పత్రుల పనితీరుపై సమీక్షించారు. ప్రభుత్వ ఆస్పత్రుల ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు. జనరల్ ఆస్పత్రిలో ఆయా విభాగాలను క్షేత్రస్థాయిలో సందర్శించి సమస్యలను పరిశీలించారు. వైద్య సేవలను మెరుగుపర్చేందుకు అవసరమైన సదుపాయాలు, వైద్య పరికరాలు, సిబ్బంది కొరత, డాక్టర్ల ఖాళీల భర్తీ గురించి ఆయా విభాగాల అధిపతులు కలెక్టర్ దృష్టికి తెచ్చారు. జీజీహెచ్‌లో వివిధ విభాగాల ద్వారా అందిస్తున్న వైద్య సేవలపై సూపరింటెండెంట్ ప్రతిమారాజ్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కలెక్టర్‌కు వివరించారు. ఆస్పత్రిలో నిత్యం సుమారు వెయ్యి నుంచి రెండు వేల మంది వరకు ఓపీ నమోదవుతుండగా.. వంద నుంచి మూడు వందల మంది వరకు ఇన్ పేషెంట్లు అడ్మిట్ అవుతున్నారని వివరించారు. రాష్ట్రంలో మరెక్కడా లేని విధంగా జీజీహెచ్‌లో ఉచితంగా కీలు మార్పిడి శస్త్ర చికిత్సలు నిర్వహిస్తున్నామని, గతేడాది 83 సర్జరీలు చేశామని తెలిపారు. సిజేరియన్లను 75 శాతం నుంచి 35 శాతానికి తగ్గించామని చెప్పారు. అయితే ఆప్తాల్మిక్ వంటి విభాగాల్లో వైద్యుల కొరత ఉందని, ఇతర విభాగాల్లోనూ టెక్నీషియన్లు, సిబ్బందిని భర్తీ చేయాల్సిన అవసరముందని కలెక్టర్‌కు నివేదించారు. ఎంఆర్ఐ, మరో ఐదు ఎక్స్‌రే యంత్రాలు అందుబాటులో ఉంటే రోగులకు సత్వరమే మరింత మెరుగైన సేవలందించేందుకు వీలవుతుందని వివరించారు. కాగా అందుబాటులో ఉన్న వనరులను పూర్తిస్థాయిలో వినియోగించుకుని ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఇందిర, ఆయా ఆస్పత్రుల సూపరింటెండెంట్లు, వివిధ విభాగాల అధిపతులు పాల్గొన్నారు.



సూపరింటెండెంట్లు, వైద్యులతో మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు

మరోసారి తనిఖీలు!

- అండర్ టేకింగ్ కళాశాలల్లో సోదాలకు సిద్ధం
- ఇటీవల తనిఖీల్లో నిబంధనలు పాటించని కాలేజీలకు నోటీసులిచ్చిన అధికారులు



ఓ ప్రయివేటు కళాశాలలో రికార్డులను పరిశీలిస్తున్న తెయూ ఆడిట్‌సెల్ అధికారులు (ఫైల్)

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీకి అండర్‌టేకింగ్ ఇచ్చిన అనుబంధ డిగ్రీ, పీజీ కళాశాలల్లో త్వరలో మరోసారి ఆడిట్‌సెల్ అధికారులు తనిఖీలు చేసేందుకు సిద్ధమవుతున్నారు. వర్సిటీ పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేటు డిగ్రీ, పీజీ కళాశాల ల్లో అనుబంధ గుర్తింపు తనిఖీలు నిర్వహించిన విషయం తెలిసిందే. వర్సిటీ పరిధిలో మూడు ప్ర భుత్వ పీజీ కాలేజీలు, 16 ప్రభుత్వ డిగ్రీ కాలేజీలు (గురుకుల కళాశాలలు సహా), 54 ప్రయివేటు డిగ్రీ కాలేజీలు, 12 ప్రయివేటు పీజీ కాలేజీలు, మూడు ఎంబీఏ, ఒక ఎంసీఏ కళాశాలలు ఉన్నాయి. తెయూ ఆడిట్ సెల్ డైరెక్టర్ ఘంటా చంద్రశేఖర్ ఆధ్వర్యంలో వర్సిటీ అధికారులు ఆయా కాలేజీల్లో ఏప్రిల్ 25 నుంచి మే 7 వరకు తనిఖీలు నిర్వహించారు. తనిఖీల సందర్భంగా సరైన మౌలిక వసతులు, నిబంధలన మేరకు కనీస సౌకర్యాలు లేని కళాశాలలకు సౌకర్యాల కల్పనకు నెలరోజుల పాటు గడువు ఇస్తూ వర్సిటీ అధికారులు నోటీసులు ఇచ్చారు. నోటీసులు అందుకున్న కళాశాలల వారు గడువు లోపు సౌకర్యాలు ఏర్పాటు చేస్తామని పేర్కొంటూ వర్సిటీ అధికారులకు అండర్‌టేకింగ్ ఇచ్చారు.

అధికారుల సన్నద్ధం

యూనివర్సిటీకి అండర్‌టేకింగ్ ఇచ్చిన కాలేజీల్లో త్వరలో మరోసారి తనిఖీలు చేసేందుకు అధికారులు సన్నద్ధమవుతున్నారు. అండర్ టేకింగ్ ఇచ్చిన వాటిలో జిల్లా కేంద్రంలోని పేరొందిన ప్రైవేటు కాలేజీలతో పాటు గ్రామీణ ప్రాంత కాలేజీలు ఉన్నాయి. ఇటీవల నిర్వహించిన తనిఖీల్లో పేరొందిన కొన్ని కళాశాలల్లో కూడా కనీస సౌకర్యాలు లేకపోవడం గమనించిన అధికారులు ఆశ్చర్యపోయినట్లు సమాచారం. కేవలం ప్రచార ఆర్భాటంతో విద్యార్థులను చేర్చుకుని అధిక ఫీజులు వసూలు చేస్తున్నట్లు గుర్తించారు. నిబంధనల మేరకు విద్యార్థులకు సౌకర్యాలు కల్పించకపోవడంతో ఆయా కళాశాలలకు నోటీసులిచ్చారు. గతంలో పని చేసిన ఆడిట్ సెల్ అధికారులు తూతూ మంత్రంగా తనిఖీలు నిర్వహించి ఆయా కళాశాలలకు అనుబంధ గుర్తింపు ఇచ్చినట్లు ఆరోపణలున్నాయి. ఈ సారి అలా జరగదని.. కనీస సౌకర్యాలు కల్పించకపోతే అనుబంధ గుర్తింపు ఇచ్చేది లేదని ఆడిట్ సెల్ అధికారులు ఖరాఖండిగా తేల్చిచెప్పినట్లు సమాచారం. దీంట్లో భాగంగా అండర్‌టేకింగ్ ఇచ్చిన కాలేజీల్లో మరో సారి తనిఖీలు చేపట్టనున్నారు.

దోస్త్‌లో కళాశాలల పేర్లు తొలగింపజేసేందుకు సిద్ధం?

అనుబంధ గుర్తింపు తనిఖీల్లో భాగంగా అండర్‌టేకింగ్ ఇచ్చిన కళాశాలల్లో నిబంధనల మేరకు కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయని కళాశాలల పేర్లను దోస్త్ వెబ్‌సైట్ నుంచి తొలగింపజేసేందుకు యూనివర్సిటీ ఆడిట్ సెల్ అధికారులు నిర్ణయించారు. దీంతో ఆయా కళాశాలల్లో ఈ విద్యాసంవత్సరంలో డిగ్రీ ప్రవేశాలు లేకుండా పోతాయి.

డిగ్రీ ప్రవేశాలు వద్దు

2024–25 విద్యాసంవత్సరంలో డిగ్రీ మొదటి సంవత్సరంలో ప్రవేశాలు వద్దని (నాట్ విల్లింగ్ టు టేక్ అడ్మిషన్స్) తెయూ పరిధిలోని ఏడు అనుబంధ ప్రైవేటు డిగ్రీ కళాశాలలు వర్సిటీ ఆడిట్ సెల్ అధికారులకు లేఖ అందజేశాయి. గత విద్యాసంవత్సరంలో ఈ కాలేజీల్లో కేవలం 0–10 ప్రవేశాలు నమోదయ్యాయి. ప్రవేశాలు వద్దని చెప్పిన వాటిలో శ్రీవిశ్వశాంతి డిగ్రీ కాలేజ్ (నిజామాబాద్), రాంరెడ్డి డిగ్రీ కాలేజ్ (మాచారెడ్డి), విజయ్ డిగ్రీ అండ్ పీజీ కాలేజ్ (ఆర్మూర్), నలంద డిగ్రీ కాలేజ్ (ఎల్లారెడ్డి), జ్ఞాన సరస్వతి డిగ్రీ కాలేజ్ (కోటగిరి), జ్ఞానోదయ డిగ్రీ కాలేజ్ (కామారెడ్డి), సాయి సిద్ధార్థ డిగ్రీ కాలేజ్ (ధర్పల్లి) ఉన్నాయి.

'బదిలీల' దందా..!

- పోలీసుల నుంచి వసూళ్లకు తెరలేపిన అధికార పార్టీ నేత
- పోస్టు, ప్లేస్ ఆధారంగా రేట్ నిర్ణయం
- ఇప్పటికే పలువురి నుంచి అడ్వాన్స్



ఖలీల్‌వాడి: శాసనసభ, లోక్‌సభ ఎన్నికలు ముగియగా.. జూన్ 4న ఎలక్షన్ కోడ్ ఎత్తివేయనున్నారు. దీంతో ఎన్నికల సందర్భంగా జిల్లాకు బదిలీపై వచ్చిన సీఐలు, ఎస్సైలు తిరిగి సొంత జిల్లాలకు వెళ్లేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇదే అదునుగా అధికార పార్టీకి చెందిన ఓ నేత బదిలీ పేరిట వసూళ్లకు తెరలేపారు. ఓ ప్రజాప్రతినిధితో ఉన్న సన్నిహిత సంబంధం కారణంగా పోస్టింగ్ ఇప్పించేందుకు బేరసారాలను మొదలు పెట్టారు. సదరు నేతకు గతంలో బదిలీల్లో చక్రం తిప్పిన పేరు ఉండడంతో కొంత మంది పోలీసులు ఆయనను ఆశ్రయిస్తున్నట్లు సమాచారం. ఎస్సైలు, సీఐలకు పోస్టింగ్ ఆధారంగా ఓ ధర నిర్ణయించినట్లు తెలిసింది. అంతేకాకుండా కావాల్సిన పోలీస్‌స్టేషన్ ఆధారంగా కూడా సదరు నేత రేటును నిర్ణయించి.. దాని ప్రకా రం అడ్వాన్స్‌లు తీసుకున్నట్లు తెలిసింది. సదరు నేతకు పలువురు అడ్వాన్స్‌లు చెల్లించడం పోలీసు వర్గాల్లో హాట్‌టాపిక్‌గా మారింది. బదిలీలు చేయిస్తానని చెప్పుకుంటున్న ఆ నేత మాత్రం పార్టీ కార్యక్రమాలకు కేవలం ఒకరు మాత్రమే వచ్చి ఫొటోలకు స్టిల్స్ ఇచ్చి వెళ్తారనే ప్రచారం పార్టీలో ఉంది. అసెంబ్లీ ఎన్నికల సమయంలో సదరు నేత వ్యవహరించిన తీరుపై కాంగ్రెస్ నేతలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆయనపై కాంగ్రెస్ నుంచి పోటీ చేసిన అభ్యర్థులకు ఫిర్యాదులు వెళ్లాయి. దీంతో ఈ నేతకు లోక్‌సభ ఎన్నికల్లో ప్రాధాన్యత ఇవ్వలేదు. దీంతో కొన్నిరోజులు స్తబ్దంగా ఉన్న ఆయన.. తాజాగా పోలీసుల బదిలీల విషయంలో వసూళ్లకు పాల్పడడం అధికార పార్టీలో చర్చనీయాంశంగా మారింది.

నిజామాబాద్‌లో ఆల్ ఇండియా క్యారమ్ టోర్నీ



మాట్లాడుతున్న సంతోష్

నిజామాబాద్‌నాగారం: జిల్లాలో ఈ నెల 23 నుంచి 26 వరకు ఆల్ ఇండియా క్యారమ్ చాంపియన్‌షిప్ నిర్వహించనున్నట్లు క్యారమ్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సంతోష్ తెలిపారు. బుధవారం నగర శివారులోని నవ్యభారతి గ్లోబల్ స్కూల్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వెటరన్ ఆల్ ఇండియా క్యారం విభాగంలో మెన్ అండ్ ఉమెన్ పోటీలు జరగనున్నాయన్నారు. ఆల్‌ఇండియా క్యారమ్ ఫెడరేషన్‌కు అనుబంధంగా ఉన్న దాదాపు 20 ప్రసిద్ధ సంస్థలు కార్యక్రమంలో పాల్గొంటాయన్నారు. వెటరన్ మెన్ అండ్ ఉమెన్ నేషనల్స్‌లో ప్రతి రాష్ట్రం నుంచి ఇద్దరు పురుషులు, ఇద్దరు మహిళా క్రీడాకారులు దాదాపు వంద మంది పాల్గొంటారన్నారు. క్రీడాకారులకు ఉచిత వసతి సదుపాయం ఉంటుందన్నారు. మొట్టమొదటిసారి రాష్ట్రంలోనే నిజామాబాద్ జిల్లాలో టోర్నీ జరుగుతోందన్నారు. మొత్తం భారతదేశం నుంచి టాప్ ర్యాంకింగ్ ప్లేయర్లు, జాతీయ, ఆసియా చాంపియన్‌లు ఈవెంట్‌లో పాల్గొంటారన్నారు. సమావేశంలో కన్వీనర్ ప్రవీణ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఘనంగా నృసింహ జయంతి



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: ఇస్కాన్ (అంతర్జాతీయ కృష్ణచైతన్య సంఘం) మందిర్ కంఠేశ్వర్ ఆధ్వర్యంలో బుధవారం నరసింహ స్వామి జయంతిని వైభవంగా నిర్వహించారు. స్వామివారికి పంచామృతాభిషేకం,పుష్పాభిషేకం, నరసింహ హోమం నిర్వహించారు. అనంతరం ఇస్కాన్ కంఠేశ్వర్ అధ్యక్షుడు రామానందరాయ్ గౌరదాస్ ప్రవచనాలు చెప్పారు. భక్తులను రక్షించేందుకే నరసింహస్వామి అవతరించారన్నారు. మిఠాయి నిజాయిచంద్, నరేశ్వర దాస్, బలరామాది గురు, అతిపురుష గోవింద దాస్, గంగేశ్వర రామదాస్, బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి మాదాసు స్వామియాదవ్ పాల్గొన్నారు.

స్కిల్ ఎన్‌హాన్స్‌మెంట్ కోర్స్ పరీక్షల షెడ్యూల్ విడుదల

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో స్కిల్ ఎన్‌హాన్స్‌మెంట్ కోర్స్ రెండో, నాలుగో, ఆరో సెమిస్టర్ రెగ్యులర్/ బ్యాక్‌లాగ్ ప్రాక్టికల్ పరీక్షల షెడ్యూల్‌ను వర్సిటీ అధికారులు బుధవారం విడుదల చేశారు. గ్రూప్- ఏ కళాశాలల్లో ఈ నెల 16 నుంచి 31వరకు, గ్రూప్-బి కళాశాలల్లో ఈ నెల 25 నుంచి జూన్ నెలాఖరు వరకు నిర్వహించి అభ్యర్థులు సాధించిన మార్కులను యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలని తెయూ పరీక్షల నియంత్రణాధికారి ఎం అరుణ తెలిపారు. వివరాలకు తెలంగాణ యూనివర్సిటీ వెబ్‌సైట్ www. telanganauniversity. ac. in ను సంప్రదించాలని సూచించారు.

నర్సరీని పరిశీలించిన డీపీవో



పెర్కిట్(ఆర్మూర్): ఆలూర్ మండలం దేగాం గ్రామంలో ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతి వనం, నర్సరీ, కంపోస్టు షెడ్డు, వైకుంఠధామాలను జిల్లా పంచాయతీ అధికారి తరుణ్ కుమార్ బుధవారం పరిశీలించారు. డీపీవో మాట్లాడుతూ వర్షాలు కురిసిన తర్వాత మొక్కలు లేని రోడ్లలో కొత్త మొక్కలను నాటించాలని అధికారులను సూచించారు. వ్యాధులు ప్రబలకుండా మురికి కాలువలను శుభ్రం చేయించాలని కార్యదర్శులను సూచించారు. డీఎల్‌పీవో శివకృష్ణ, ఎంపీవో శ్రీనివాస్ పాల్గొన్నారు.

గడ్డివాములు, ఎడ్ల బండ్లు దగ్ధం

పెద్దకొడప్‌గల్: గడ్డివాములు, ఎడ్ల బండ్లు కాలిపోయిన ఘటన మండలంలోని పోచారం తండాలో చోటు చేసుకుంది. బన్సీలాల్ అనే రైతుకు చెందిన రెండు గడ్డివాములు, రెండు ఎడ్ల బండ్లు బుధవారం సాయంత్రం ప్రమాదవశాత్తు కాలిపోయాయి. అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు.

జిల్లాకు చేరిన యూనిఫాం వస్త్రాలు

- కుట్టడానికి మహిళా సంఘాల సభ్యులకు అందజేత
- ప్రతి విద్యార్థికి ఒక జత యూనిఫాం అందించడానికి ఏర్పాట్లు



మోర్తాడ్: పాఠశాలలు పున ప్రారంభం అయ్యేనాటికి ప్రతి విద్యార్థికి ఒక్కో జత యూనిఫాం అందించడానికి జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాట్లు జరుగుతున్నాయి. మహిళా సంఘాల ఆధ్వర్యంలోనే యూనిఫాంలు కుట్టడానికి విద్యా శాఖతో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఒప్పందం కుదుర్చుకుంది. ఇప్పటికే వస్త్రం సరఫరాలో తీవ్ర జాప్యం జరుగగా మంగళవారం ప్రతి విద్యార్థికి ఒక జతకు సరిపడేంత బట్టను జిల్లా కేంద్రానికి పంపించారు. ఈ వస్త్రాలను 79 మహిళా సంఘాల ఆధ్వర్యంలోని కుట్టు కేంద్రాలతో పాటు మహిళా సంఘాల సభ్యులు ఇళ్లలో కుట్టి ఇవ్వడానికి పంపిణీ చేయనున్నారు. జిల్లాలోని అన్ని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో ఉన్న విద్యార్థుల సంఖ్య 1.12లక్షలుగా తేల్చారు. కొత్తగా అడ్మిషన్ తీసుకునే విద్యార్థుల సంఖ్యను కూడా అంచనా వేసి అందరికి ఒక్కో జత యూనిఫాంను మొదలు అందించాలని నిర్ణయించారు. యూనిఫాంలు కుట్టడానికి ఒక్కో జతకు రూ.50 మాత్రమే కుట్టు కూలిగా ప్రభుత్వం నిర్ణయించింది. మార్కెట్‌లో యూనిఫాంలను ఇంత తక్కువ ధరకు కుట్టలేమని ప్రైవేటు ఏజెన్సీలు చేతులెత్తివేశాయి. మహిళా సంఘాల్లోని సభ్యులకు చేతినిండా పని కల్పించడానికి యూనిఫాంలను కుట్టే బాధ్యత అప్పగించాలని గతంలోనే నిర్ణయించారు. ఇంత తక్కువ కుట్టుకూలి తమకు గిట్టుబాటు కాదని మహిళా సంఘాల సభ్యులు వెల్లడించారు. భవిష్యత్తులో కుట్టుకూలి పెంచితే లాభం జరుగుతుందనే ఉద్దేశ్యంతో మహిళా సంఘాల సభ్యులను ఉన్నతాధికారులు ఒప్పించారు. పాఠశాలల పున ప్రారంభానికి 22 రోజులే గడువు ఉండగా అంతలోపు ఒక్కో జత అందించడం సాధ్యం అవుతుందా అనే సందేహం వ్యక్తం అవుతుంది.

వస్త్రాలు పంపిణీ చేస్తున్నాం

జిల్లా కేంద్రానికి సరఫరా అయిన బట్టను మండలాల వారిగా పంపిణీ చేయడానికి ఏర్పాట్లు చేశాం. మహిళా సంఘాలకు గతంలోనే శిక్షణ ఇచ్చాం. అనేక మందికి టైలరింగ్‌పై పట్టు ఉండటంతో వేగంగానే యూనిఫాంలను కుడుతారనే నమ్మకం ఉంది. ఒక జత యూనిఫాంను తొందరలోనే అందుబాటులో ఉంచుతాం.

– సాయాగౌడ్, డీఆర్‌డీవో

ప్రారంభానికి సిద్ధమైన సీడ్ సర్టిఫికేషన్ సెంటర్

- విత్తన నాణ్యత పరీక్షలకు అవకాశం



సీడ్ సర్టిఫికేషన్ సెంటర్ భవనం

వేల్పూర్: వేల్పూర్ క్రాస్‌రోడ్డు సమీపంలో 63 నంబరు జాతీయ రహదారి పక్కన నిర్మించిన సీడ్ సర్టిఫికేషన్ సెంటర్ ప్రారంభోత్సవానికి సిద్ధమైంది. రైతులకు నాణ్యమైన విత్తనాలు లభించడానికి ఈ కేంద్రం తోడ్పడానికి అవకాశం ఉంది. బాల్కొండ, ఆర్మూర్, నిజామాబాద్ రూరల్ నియోజకవర్గాల్లోని వాణిజ్య పంటలు పండించే రైతులకు వ్యాపారులు అందజేసే విత్తనాలు ఇక్కడనే ధృవీకరించుకోడానికి మార్గం ఉంటుంది. విత్తనాల నాణ్యతను పరీక్షించే కేంద్రాలు హైదరాబాద్‌లోనే ఉన్నాయి. జిల్లాలో ఎర్రజొన్న, తెల్లజొన్న, సజ్జ, మొక్కజొన్న, వరి తదితర రకాల పంటలకు అవసరమైన విత్తనాలను ఉత్పత్తి చేసే సీడ్ కంపెనీలు అనేకం ఉన్నాయి. సీడ్ సాగు ఇక్కడే సాగుతున్నా, విత్తనం నాణ్యతను పరీక్షించడానికి హైదరాబాద్‌కు వెళ్తున్నారు. ఈ విధానంతో వ్యాపారులకు, రైతులకు ఇబ్బంది కలుగుతోందని తెలుసుకున్న మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి రూ.95 లక్షలతో గతేడాది సీడ్ సర్టిఫికెషన్ సెంటరును మంజూరు చేయించారు. ఈ సెంటర్‌లో విత్తనాల నాణ్యతను పరీక్షించి, ధృవీకరణ సర్టిఫికెట్ జారీ చేస్తారు. దీంతో వ్యాపారులు విత్తనాలను ఇక్కడే ధృవీకరించుకొని రైతులు అందజేయడానికి మార్గం ఏర్పడుతుంది. గతేడాది జనవరిలో శంకుస్థాపన చేయగా పనులు పూర్తయ్యాయి.



అ'పూర్వ' సమ్మేళనం

ఇందల్వాయి: మండలంలోని ఎల్లారెడ్డిపల్లి ఉన్నత పాఠశాలలో 2005-06లో పదో తరగతి చదివిన విద్యార్థులు బుధవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. తమకు చదువు చెప్పిన గురువులు రాజేశ్వర్‌రెడ్డి, గోవింద్, ఉషా, గోదావరిని సన్మానించారు.

తూకం వేయగానే ధాన్యాన్ని మిల్లులకు తరలించాలి



ఫత్తేపూర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

పెర్కిట్(ఆర్మూర్): కొనుగోలు కేంద్రాలకు రైతులు తెచ్చిన ధాన్యాన్ని వెంటనే తూకం వేసి నిర్దేశిత రైస్ మిల్లులకు తరలించాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు అధికారులకు సూచించారు. ఆర్మూర్ మండలం ఫత్తేపూర్‌లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్‌తో కలిసి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఆర్‌ఐలను నియమించి తరలించిన ధాన్యాన్ని రైస్‌మిల్లుల వద్ద వెనువెంటనే అన్‌లోడింగ్ చేసేలా చూడాలని అధికారులకు సూచించారు. అవసరమైతే లారీల సంఖ్యను పెంచి ధాన్యం సేకరణ పూర్తయిన కేంద్రాల నుంచి హమాలీలను అవసరమైన కేంద్రాల వద్ద వినియోగించుకోవాలన్నారు. అలాగే కొనుగోలు పూర్తి కాగానే వెంటనే ట్యాబ్ ద్వారా ఎంట్రీలను పూర్తి చేసి రైతులకు సకాలంలో బిల్లులు చెల్లించేలా చూడాలని పేర్కొన్నారు. పంట దిగుబడి ఆలస్యంగా వచ్చిన 23 ప్రాంతాల్లో కొనుగోలు కేంద్రాలను రైతులకు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. కేంద్రాల్లో ఇబ్బందుల గురించి రైతులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో రాజాగౌడ్, డీఎస్‌వో చంద్ర ప్రకాశ్, పౌర సరఫరాల శాఖ డీఎం జగదీశ్, డీసీవో శ్రీనివాస్, తహసీల్దార్ గజానంద్ తదితరులు పాల్గొన్నారు.

సీపీ ఆఫీస్‌కు కానిస్టేబుల్ అటాచ్

ఖలీల్‌వాడి: నగరంలోని మూడో టౌన్ పోలీస్‌స్టేషన్‌కు చెందిన కానిస్టేబుల్ అప్సర్‌ను సీపీ ఆఫీస్‌కు అటాచ్ చేసినట్లు ఆలస్యంగా తెలిసింది. ఇటీవల జరిగిన లోకసభ ఎన్నికలలో ఓ జాతీయపార్టీకి చెందిన నాయకులు, కార్యకర్తలను తనిఖీల పేరిట అప్సర్ ఇబ్బందులు గురిచేసినట్లు ఆరోపణలు వచ్చాయి. పోలింగ్ చిట్టీలు పంచుతున్న ఓ వ్యక్తిని తనిఖీలు చేయడంతోపాటు అతని జేబులో ఉన్న డబ్బులు తీసుకున్నట్లు ఆరోపణలు వచ్చాయి. దీంతో సంబంధిత పార్టీ నేతలు సీపీ కల్మేశ్వర్ దృష్టికి తీసుకువెళ్లడంతో సీపీ ఆఫీస్‌కు అటాచ్ చేశారు. ఆయనకు ప్రస్తుతం డిచ్‌పల్లిలోని సీఎంసీ మెడికల్ కాలేజీ వద్ద ఈవీఎంల బందోబస్తు డ్యూటీ వేసినట్లు తెలిసింది.

గాలివాన బీభత్సం



తాళ్లరామడుగులో నేలకూలిన చెట్టు



జీజీనడ్కుడ రోడ్డుపై విరిగిపడిన చెట్టు కొమ్మ

సిరికొండ: మండలంలో బుధవారం సాయంత్రం గాలులతో కూడిన వర్షం కురిసింది. 15 నిమిషాల పాటు భారీ గాలులు వీచాయి. గాలులకు పలు గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు పడిపోయాయి. భారీ చెట్లు నేలకులాయి. మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో ఇంటి పైకప్పు రేకులు లేచిపోయాయి. తాళ్లరామడుగులో అంబేద్కర్ విగ్రహం వద్ద పెద్ద చెట్టు నేలకూలి విద్యుత్ తీగలపై పడింది. మైలారంలో రెండు విద్యుత్ స్తంభాలు పడిపోయాయి. సిరికొండ ఆర్టీసీ బస్టాండ్‌లో విద్యుత్ వైర్లపై చెట్టు పడింది.

డొంకేశ్వర్(ఆర్మూర్): డొంకేశ్వర్ మండల వ్యాప్తంగా బుధవారం సాయంత్రం భారీ గాలులు బీభత్సం సృష్టించాయి. బలమైన గాలులకు చెట్లు, చెట్ల కొమ్మలు రోడ్లపై విరిగిపడ్డాయి. రేకులు ఎగిరిపోయాయి. దత్తాపూర్, జీజీనడ్కుడ, డొంకేశ్వర్, అన్నారం ప్రాంతాల్లో చెట్ల కొమ్మలు రోడ్లపై పడడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఎదురయ్యాయి.

ప్రధాన కాలువలో పూడిక తొలిగించరూ!



లక్ష్మి కాలువలో పేరుకుపోయిన పూడిక

- లక్ష్మి ప్రధాన కాలువలో పేరుకుపోయిన మట్టి
- ఉప కాలువల్లో ఉపాధి కూలీలతో తొలగింపు

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నుంచి నీటిని సరఫరా చేసే లక్ష్మి ప్రధాన కాలువలో పేరుకుపోయిన పూడికను తొలిగించాలని ఆయకట్టు రైతులు వేడుకుంటున్నారు. లక్ష్మి కాలువ ఉప కాలువలు, మైనర్ కాలువల్లోని పూడికను ఉపాధిహామీ కూలీల ద్వారా తొలగించారు. కానీ ప్రధాన కాలువలో మాత్రం పూడిక తొలగింపును మరిచారు. ప్రాజెక్ట్ నుంచి ముప్కాల్ మండలం కొత్తపల్లి శివారు వరకు లక్ష్మి ప్రధాన కాలువ 3.5 కిలోమీటర్ల పొడవుతో ఉంటుంది. అక్కడి నుంచి ఉప కాలువలు డీ-3, డీ-4 ప్రవహిస్తాయి. ఉప కాలువలకు అనేక మైనర్ కాలువలు కూడా ఉన్నాయి. అవి గ్రామాల వెంబడి ఉండటంతో ఆయా గ్రామాల ఉపాధిహామీ కూలీలతో పూడికను తొలగించారు. అయితే, ప్రధాన కాలువ ఏ గ్రామాన్ని ఆనుకొని లేకుండా ప్రవహిస్తోంది. ప్రధాన కాలువ ముప్కాల్ మండలం నల్లూర్, ముప్కాల్ , కొత్తపల్లి శివారు మీదుగా ప్రవహిస్తుంది. దీంతో ఏ గ్రామానికి చెందిన ఉపాధి కూలీలు పూడిక తొలగించేందుకు ముందుకు రాలేదు. ప్రధాన కాలువ సామర్థ్యం 500 క్యూసెక్కులు కాగా, పూడిక పేరుకుపోవడంతో కాలువ సామర్థ్యం రోజురోజుకూ తగ్గుతోంది. ప్రస్తుతం 200 క్యూసెక్కుల కంటే ఎక్కువ నీటిని వదిలే అవకాశం లేకుండా పోయింది. ప్రధాన కాలువలోని పూడికను ఉపాధి కూలీలతో లేదా యంత్రాలతో తొలగించేందుకు కృషి చేయాల్సిన అవసరం ఉంది. లక్ష్మి కాలువ నల్లూర్, ముప్కాల్, కొత్తపల్లి, నాగంపేట్, రెంజర్ల, మోర్తాడ్ మండలం శెట్‌పల్లి గ్రామాల మీదుగా ప్రవహిస్తుంది. అంతే కాకుండా చౌట్‌పల్లి హన్మంత్‌రెడ్డి ఎత్తిపోతల పథకం ద్వారా కమ్మర్‌పల్లి మండలం, నవాబు ఎత్తిపోతల పథకం ద్వారా వేల్పూర్ మండల రైతులకు నీరందుతోంది. ప్రధాన కాలువ పూడికతీత కోసం ఆయకట్టుకు సంబంధించిన అన్ని గ్రామాల ఉపాధిహామీ కూలీలతో పనులు చేపట్టే ఏర్పాట్లు చేయాల్సిన అవసరం ఉంది. కూలీలకు రవాణా భత్యం ఇచ్చి పనులు చేపట్టాలి. ఉన్నతాధికారులు స్పందించి ప్రధాన కాలువలోని పూడికను తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.

మాక్లూర్ సొసైటీలో విచారణ



విచారణ చేస్తున్న అధికారులు

మాక్లూర్: మాక్లూర్ సొసైటీలో అవకతవకలపై బుధవారం అధికారులు విచారణ చేపట్టారు. సొసైటీలో అక్రమాలు జరిగాయని ఆరు నెలల క్రితం ధర్మసమాజ్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రేమ్‌కుమార్ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో బుధవారం సంబంధిత అధికారులు మాక్లూర్ సొసైటీలో విచారణ ప్రారంభించారు. విచారణ సమయంలో ఇటీవలే బాధ్యతలు చేపట్టిన కార్యదర్శి విష్ణువర్ధన్, డైరెక్టర్ కాశీనాథ్‌రావు ఉన్నారు.

చికిత్స పొందుతూ మృతి

పిట్లం(జుక్కల్): కడుపు నొప్పి భరించలేక వారం క్రితం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తి చికిత్స పొందుతు బుధవారం మృతి చెందాడు. మండలంలోని బుర్నాపూర్ గ్రామంలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఎస్సై నీరేష్ తెలిపిన వివరాలు.. బుర్నాపూర్ గ్రామానికి చెందిన చొక్కారెడ్డి(65) ఆరు నెలల నుంచి కడుపు నొప్పితో బాధపడుతున్నాడు. ఆస్పత్రుల్లో చూపించిన నయం కాకా పోవడంతో ఈ నెల 16న పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి కుమారుడు జలంధర్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి..



గంగాధర్(ఫైల్)

మోపాల్: మండలంలోని నర్సింగ్‌పల్లి గ్రామానికి చెందిన గంగాధర్ (30) చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. వివరాలు.. ఈ నెల 19న కంజర్ శివారులోని రెసిడెన్షియల్ పాఠశాల మూలమలుపు వద్ద కారు ఢీకొన్న ఘటనలో గంగాధర్ గాయపడ్డాడు. అప్పటి నుంచి ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. బుధవారం పరిస్థితి విషమించి మృతి చెందాడు. మృతుడికి ఇద్దరు కుమారులు ఉన్నారు. బావ నారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

క్రైం కార్నర్

వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురి మృతి

పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మండలం పిప్రి చెరువులో పడి ఎర్రోల్ల కాశీరాం(42) అనే వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. కామారెడ్డి జిల్లా నిజాంసాగర్ మండలం వడ్డేపల్లి గ్రామానికి చెందిన కాశీరాం కొన్నేళ్లుగా పిప్రి గ్రామంలో దినసరి కూలీగా పని చేస్తున్నాడు. మంగళవారం ఉదయం చేపల వేటకు వెళ్లి కాశీరాం ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఫైర్ సిబ్బంది, గజ ఈతగాళ్ల సాయంతో మృతదేహాన్ని వెలికి తీశారు. కాశీరాం భార్య కొన్నేళ్ల క్రితం మృతి చెందింది. మృతుడి సోదరుడు రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.

రైలు నుంచి పడి ఒకరు..



కామారెడ్డి క్రైం: రైలులో నుంచి జారి పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన తలమడ్ల-భిక్కనూర్ రైల్వే స్టేషన్‌ల మధ్య బుధవారం చోటు చేసుకుంది. పట్టాల పక్కన ఓ వ్యక్తి మృతదేహం పడి ఉందని సమాచారం రావడంతో కామారెడ్డి రైల్వే ఎస్సై తావూనాయక్, సిబ్బంది అక్కడకు చేరుకుని విచారణ జరిపారు. మృతుడి వయస్సు 35 నుంచి 40 ఏళ్ల మధ్య ఉండవచ్చని ఎస్సై తెలిపారు. ప్రమాదవశాత్తు గుర్తు తెలియని రైలు నుంచి జారి పడి మృతి చెందినట్లు తెలుస్తుందన్నారు. మృతుడి వద్ద ఎలాంటి ఆనవాళ్లు లభించలేదు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆస్పత్రికి తరలిస్తున్నామని వెల్లడించారు.

ఆటో బోల్తా పడి మహిళ..



సవిత (ఫైల్)

రాజంపేట: ఆటో బోల్తా పడి మహిళ మృతి చెందిన ఘటన రాజంపేట మండలం తలమడ్ల శివారులో బుధవారం చోటు చేసుకుంది. వివరాలు.. కొండాపూర్ గ్రామానికి చెందిన కీసరి సవిత (32) ఆశవర్కర్‌గా పని చేస్తోంది. ఆరెపల్లిలో బంధువుల ఇంటికి వెళ్లడానికి కామారెడ్డిలో ఆటో ఎక్కింది. ఆటో తలమడ్ల శివారులో బోల్తా పడింది. సవిత అక్కడికక్కడే మృతి చెందింది. ఇతర ప్రయాణికులకు స్వల్ప గాయాలైనట్లు స్థానికులు తెలిపారు. మృతురాలికి ఒక కొడుకు ఉన్నాడు. సవిత భర్త సాయిలు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

బిచ్కుంద బస్టాండ్‌లో చైన్‌స్నాచింగ్



బిచ్కుంద: బిచ్కుంద బస్టాండ్‌లో బస్సు ఎక్కుతున్న మహిళ మెడలో నుంచి రెండు తులాల పుస్తెల తాడును చోరీ లాక్కొని దొంగ పారిపోయాడు. ఈ ఘటన బుధవారం చోటు చేసుకుంది. బీర్కూర్ గ్రామానికి చెందిన శకుంతల బిచ్కుందలో బంధువుల ఇంటికి వచ్చారు. తిరిగి వెళ్లడానికి బాన్సువాడ బస్సు ఎక్కుతుండగా దుండగుడు ఆమె మెడలో నుంచి పుస్తెల తాడు తెంపుకొని పారిపోయాడు. బస్సు ఎక్కి చూడగా పుస్తెల తాడు కనబకపోవడంతో పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు బస్సు ఆపి ప్రయాణికులను తనిఖీ చేసినా ఎలాంటి లాభం లేకుండా పోయింది.

పాముకాటుతో బాలిక ..



కల్పన(ఫైల్)

గాంధారి: పాముకాటుతో బాలిక మృతి చెందిన ఘటన మండలంలోని చద్మల్ గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన మేక కల్పన(14) రోజూ మాదిరిగా కుటుంబ సభ్యులతో కలిసి మంగళవారం రాత్రి వాకిట్లో పడుకుంది. రాత్రి నిద్రలో పాము కుట్టింది. బాలిక గమనించలేదు. బుధవారం తెల్లజామున కల్పన మృతి చెందింది. విషయం తెలుసుకున్న ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు బాలిక తల్లిదండ్రులకు రూ.5,000 ఆర్థిక సాయం చేశారు.

బస్సు, వ్యాను ఢీ



లింగంపేట: మండలంలోని మెంగారం శివారులో బస్సు-వ్యాను ఢీకొన్నాయి. వివరాలు.. లింగంపేటకు చెందిన సదానందం భార్య, కుమారుడితో ఎల్లారెడ్డి వైపు వెళ్తున్నాడు. ఎల్లారెడ్డి నుంచి కామారెడ్డి వైపు వస్తున్న బస్సు, వ్యాన్ మెంగారం శివారులో ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో వ్యాను పూర్తిగా ధ్వంసమైంది. వ్యానులో ఉన్న ముగ్గురు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఈ విషయమై బస్సు, వ్యాను డ్రైవర్లు లింగంపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చైతన్యకుమార్‌రెడ్డి తెలిపారు.

టాటా ఏస్ వాహనం బోల్తా



వర్ని: మండలం బేల్యానాయక్ తండా మూలమలుపు వద్ద బుధవారం చింత పండు లోడ్‌తో వెళ్తున్న టాటా ఏస్ వాహనం బోల్తా పడింది. బాన్సువాడ వైపు నుంచి బోధన్ వైపు వెళ్తున్న వాహనం మూలమలుపు వద్ద బోల్తా పడింది. ప్రమాదంలో ఒకరికి స్వల్ప గాయాలు అయ్యాయి.

మొరం టిప్పర్ల పట్టివేత

మోపాల్: అనుమతులు లేకుండా మొరం తరలిస్తున్న టిప్పర్లను భూగర్భ గనులశాఖ అధికారులు బుధవారం పట్టుకున్నారు. రాములు, నవీన్‌రెడ్డికి చెందిన టిప్పర్లలో నిజామాబాద్‌తోపాటు ఇతర గ్రామాలకు అక్రమంగా మొరం తరలిస్తున్నారు. గ్రామస్తుల ఫిర్యాదు మేరకు మైనింగ్ అధికారులు రెండు టిప్పర్లను పట్టుకుని పోలీసులకు అప్పగించారు. కాగా మండలంలో ఇసుక, మొరం, మట్టి అక్రమ రవాణాపై పోలీసులు, తహసీల్దార్‌కు అనేక ఫిర్యాదులు వస్తున్నట్లు తెలిసింది.

గంజాయి కేసులో తొమ్మిది మంది అరెస్టు

మోర్తాడ్: బంధువుల ఇంటికి శుభకార్యానికి వచ్చిన హైదరాబాద్‌కు చెందిన ఆరుగురితో పాటు కమ్మర్‌పల్లికి చెందిన ఒకరు, నిర్మల్‌కు చెందిన మరో ఇద్దరు గంజాయి కేసులో అరెస్టు అయ్యారు. ఏర్గట్ల ఎస్సై మచ్చేందర్‌రెడ్డి బుధవారం తెలిపిన వివరాలు.. కమ్మర్‌పల్లికి చెందిన ఎండీ ఆరీఫ్ ఇంట్లో శుభకార్యానికి హైదరాబాద్‌కు చెందిన అబ్దుల్ రహమాన్, ఎండీ అజర్, ఎస్‌కే శంషద్, సమీర్, ప్యార్శని వంశీవర్ధన్, ఎండీ సలీం పాషా హాజరయ్యారు. వీరు ఏర్గట్ల మండలం తాళ్లరాంపూర్ ఈతవనంలో మంగళవారం గంజాయి తాగుతూ హంగామా చేశారు. స్థానికుల ఫిర్యాదులో పోలీసులు వీరిని అరెస్టు చేశారు. వీరు నిర్మల్‌కు చెందిన షేక్ షాదుల్లా, సయ్యద్ అజారుద్దీన్ వద్ద గంజాయి కొనుగోలు చేసినట్లు గుర్తించి, వారిని అరెస్టు చేసినట్లు ఎస్సై తెలిపారు. 268 గ్రాముల గంజాయి, ఒక స్కార్పియో వాహనం, ఏడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకొని సీజ్ చేసినట్లు పేర్కొన్నారు.

డ్రంకన్ డ్రైవ్ కేసులో ఇద్దరికి జైలుశిక్ష

కామారెడ్డి క్రైం: మద్యం తాగి వాహనం నడిపిన ఇద్దరికి కామారెడ్డి కోర్టు రెండు రోజుల జైలు శిక్ష విధించినట్లు పట్టణ ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. రెండు రోజుల క్రితం పట్టణ పోలీసులు వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా భుక్యా బందర్, మాయం రాజయ్య డ్రంకన్ డ్రైవ్‌లో పట్టుబడ్డారు. వారిని బుధవారం కోర్టుకు హాజరుపర్చగా ద్వితీయ శ్రేణి న్యాయమూర్తి ప్రతాప్ జైలు శిక్ష విధించారని ఎస్‌హెచ్‌ఓ తెలిపారు.

దాడి చేసిన వ్యక్తిపై కేసు

ఖలీల్‌వాడి: దాడి కేసులో నగరంలోని గాజుల పేటకు చెందిన శివకుమార్‌పై కేసు నమోదు చేసినట్లు రెండో టౌన్ ఎస్సై రాము తెలిపారు. వివరాలు.. గాజులపేట్ చెందిన పల్లికొండ అశోక్ తన తండ్రి, తమ్ముడితో కాలనీలోని పాత ఇంటికి వెళ్లాడు. ఆ ఇంటి వద్ద చెత్త వేశారని అదే కాలనీకి చెందిన శివకుమార్ వారితో గొడవకు దిగాడు. అనంతరం కర్రతో దాడి చేశాడు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

చోరీ కేసులో ఒకరి అరెస్ట్

ఖలీల్‌వాడి: నగరంలోని నాలుగో టౌన్ ఠాణా పరిధిలోని షిర్డీ సాయినగర్‌లో చోరీకి పాల్పడిన ఒకరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఇన్‌చార్జి సీఐ విజయ్‌బాబు తెలిపారు. వివరాలు.. ఈ నెల 4న మధ్యాహ్నం షిర్డీ సాయినగర్‌కు చెందిన దాచ మధుసూదన్ ఇంట్లో పెద్దపల్లి జిల్లా శ్రీరాంపూర్ మండలం మడిపల్లి గ్రామానికి చెందిన శివకుమార్ చోరీ చేశాడు. రెండున్నర తులాల బంగారం, కిలో వెండి ఎత్తుకెళ్లాడు. బుధవారం నిజామాబాద్ బస్టాండ్‌లో శివకుమార్‌ను అదుపులోకి తీసుకొని విచారించగా నేరం ఒప్పుకున్నట్లు సీఐ తెలిపారు. బంగారం, వెండి స్వాధీనం చేసుకొని శివకుమార్‌ను రిమాండ్ తరలించామన్నారు. నిందితుడికి విజయ్‌కుమార్ సహకరించినట్లు తెలిపారు.

బెల్టుషాపుపై దాడి

మోపాల్: మండలంలోని మంచిప్పలో బెల్టుషాపుపై పోలీసులు బుధవారం దాడి చేశారు. రూ.1.70లక్షల విలువైన 363 లీటర్ల మద్యం పట్టుకుని సీజ్ చేసినట్లు ఎస్సై గంగాధర్ తెలిపారు. గ్రామంలో బెల్టుషాపు నిర్వహిస్తున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు దాడి చేసినట్లు పేర్కొన్నారు. బెల్టుషాపు నిర్వహిస్తున్న బానోత్ వెంకట్రాంపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అక్రమంగా మద్యం అమ్మితే చర్యలు తీసుకుంటామన్నారు.